క్లుప్తంగా

ఆర్టీసీ సర్వీసు ప్రారంభం



కదిరి- బెంగుళూరు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో కదిరి– బెంగళూరు సర్వీసును ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఈ బస్సు రోజూ తెల్లవారుజామున 5-45 గంటలకు కదిరిలో బయలుదేరి గోరంట్ల మీదుగా బెంగళూరుకు ఉదయం 10-30 గంటలకు చేరుతుందని, తిరిగి ఉదయం 11 గంటలకు బెంగుళూరులో బయలుదేరి గోరంట్ల మీదుగా కదిరికి సాయంత్రం 5 గంటలకు చేరుకుంటుందని డీఎం మైనోద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఎమ్మెల్యేని శాలువాలతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఎమ్మెల్యేతో పాటూ ఈటె రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బత్తలపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని ఆదివారం ఒక ప్రకటనలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

గాండ్లపెంటలో 25.2 మి.మీ వర్షపాతం

గాండ్లపెంట: మండలంలో శనివారం రాత్రి 25.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ సిబ్బంది ఆదివారం తెలిపారు. గంట పాటు కురిసిన వర్షం వల్ల చిన్నకుంటలలో నీరు రాగా ఖరీఫ్‌లో వర్షధారం కింద సాగు చేసిన వేరుశనగ, కంది పంటలకు వర్షంతో నీటి ఊరట లభించింది. అదే విధంగా పశువులకు గ్రాసం లభిస్తుందని పశు యజమానులు తెలిపారు.

కంటి ఆరోగ్యంపై దృష్టి సారించాలి



దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై దృష్టి సారించాలన రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్త సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటిచూపు తగ్గిన వారికి బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. శిబిరం దాతలుగా కలవల మురళీధర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా 237 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 130 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. అనంతరం క్యాంపు దాతలతోపాటు వైద్యులను రోటరీ క్లబ్ సభ్యులు సన్మానించారు. సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రసాల ప్రసన్న కుమార్, రోటరీక్లబ్ సభ్యులు రమేష్‌బాబు, శివయ్య, కృష్ణమూర్తి, రామంజినేయులు, మనోహర్‌గుప్త పాల్గొన్నారు.

ఆలయంపై కూలిన చెట్టు



గుడి పైకప్పుపై కూలిన చెట్టు

సోమందేపల్లి: మండల కేంద్ర ంలోని పాత ఊరులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంపై రావిచెట్టు కూలిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎన్నో ఏళ్ల చెట్టు కావడంతో ఆలయంపై కప్పుపై కొమ్మలు వాలాయి. భక్తులు, చుట్టు పక్కల ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టును తొలగించకపోతే ఆలయంపై పూర్తిగా చెట్టు కూలిపోయే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

పేదలకు వంట సామగ్రి పంపిణీ

రొద్దం: పెద్దగువ్వలపల్లి గ్రామంలో వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో 121 నిరుపేద కుటుంబాలకు ఆదివారం వంట సామగ్రి పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సమావేశం ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు వంట చేసుకోవడానికి అవసరమయ్యే పాత్రలు, ప్లేట్లు, గ్లాసులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు.

వైభవంగా కాశీంస్వామి చిన్న సరిగెత్తు



బత్తలపల్లి కాశీంస్వామికి చదివింపులు చేస్తున్న ముల్లాసాహెబ్‌లు



బత్తలపల్లి గుండం వద్ద చిన్నారుల కేరింతలు



ధర్మవరం కొత్తపేటలో కొలువుదీరిన పీర్లస్వాములు

బత్తలపల్లి: మండల కేంద్రంలో చిన్నకాశీం స్వామి, పెద్దకాశీంస్వామి మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్న సరిగెత్తు వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముస్లింలు పానకాలు చదివించగా, ఆదివారం రాత్రి హిందువులు పక్కీరుబాబాలుగా దీక్ష చేపట్టారని ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, ఖాశీంవలి తెలిపారు. శనివారం రాత్రి కురిసిన వర్షం కారణంగా అగ్ని గుండం పెద్దగా వెలగలేదు. సోమవారం ఉదయం గ్రామోత్సవం అనంతరం పీర్లు గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లి ఆ గ్రామాల్లో నిలిపిన పీర్ల చావిడి వద్ద పీర్లు పూజలందుకుంటాయి. ఈ విధంగా పీర్లు అన్ని గ్రామాలను సందర్శించి అక్కడిపీర్లను జలధి రోజు భేటీలకు బత్తలపల్లికి రమ్మని ఆహ్వానించినట్లుగా అందరూ భావిస్తారు. ఇదిలా ఉండగా గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలలో బత్తలపల్లి పీర్లకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు చర్యలు తీసుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి.ఆదివారం కొత్తపేటలో చిన్న సరిగెత్తుకు పీర్లు ముస్తాబయ్యాయి. పీర్లస్వాములు హసేన్, హుస్సేన్, ఇమామ్ ఖాసీం, మౌలాలి, బాబావలి, జలాలి టోపీ సాహెబ్‌లను పూలమాలలు, వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు బిల్లే శీనయ్య, మాబు, బాషా, చంద్ర, హసేన్, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: సీపీఎస్ ఉద్యోగులను జీపీఎస్‌లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ జోన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేశామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం జీపీఎస్ చట్టాన్ని ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. మళ్లీ ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరూ ఉద్యమబాట పట్టాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీపీఎస్ చట్టాన్ని రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, రాంప్రసాద్, పెద్దకోట్ల సురేష్, సాయిగణేష్, రామంజినేయులు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్తుల పాదయాత్ర



కనుముక్కల ఉన్నత పాఠశాలకు చేరిన మహారాష్ట్రకు చెందిన శ్రీసత్యసాయి భక్తులు

చెన్నేకొత్తపల్లి: మహారాష్ట్రకు చెందిన సత్యసాయి బాబా భక్తులు చేపట్టిన పాదయాత్ర ఆదివారం సాయంత్రం మండలంలోని కనుముక్కల గ్రామానికి చేరుకుంది. ధర్మవరం రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి దాదాపు 1,200 మంది సాయి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. మార్గమధ్యంలో కనుముక్కల గ్రామానికి చేరుకున్న వీరు రాత్రి స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బస చేశారు. అనంతరం అక్కడే శ్రీసత్యసాయి బాబా భజనలు చేశారు. పలువురు భక్తులు మాట్లాడుతూ.. ఏటా ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి పండుగ రోజున శ్రీసత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకుంటామన్నారు. ప్రతి ఏడాది పుట్టపర్తికి వస్తామన్నారు. శ్రీసత్యసాయి భజనలు వినేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఉన్నత పాఠశాలకు తరలివచ్చారు.

భగవంతునిపై నమ్మకం ఉంచాలి



హిందూపురం: భగవంతునిపై నమ్మకంతో, భక్తిభావంతో మెలగాలని భక్త వృందదాస అన్నారు. బెంగళూరు ఇస్కాన్ ఉపన్యాసకులు, ఆధ్యాత్మిక వేత్త భక్త వృందదాస ఆదివారం రాత్రి హిందూపురంలోని లయన్స్ క్లబ్‌లో భాగవతం ప్రవచనాలు చేశారు. అనంతపురం జిల్లాలో మొట్టమొదటిగా హిందూపురం నుంచి ఈ ప్రవచన కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. భాగవత దివ్య ప్రవచనం హృదయాలలో ఆధ్యాత్మిక ఆనందాన్ని, శాంతిని ప్రసాదిస్తుందని వివరించారు. అందరూ ఆధ్యాత్మికంగా భక్తిశ్రద్ధలతో దైవ చింతన కల్గి ఉండాలని సూచించారు. దేవుడు అలాంటి వారిని అన్నివేళలా కాపాడతారని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతకు ఆధ్యాత్మికంగా మార్గదర్శకత్వం వహించాలన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం



ఆత్మకూరు: పంపనూరులోని సర్ప రూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామికి పట్టు వస్త్రాలతో పాటు బంగారు ఆభరణాలను అలంకరించారు. అనంతరం ఆకుపూజతో పాటు విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కాల సర్పదోష నివారణ హోమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు



రేగాటిపల్లి వద్ద సేంద్రియ ఎరువులతో సాగు చేసిన టమాట పంట

- రసాయనిక ఎరువులతో రైతులకు నష్టాలు
- పెరుగుతున్న సేంద్రియ ఎరువుల వాడకం

ధర్మవరం రూరల్: విచ్చల విడిగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి తన సహజ లక్షణాన్ని కోల్పోయి చౌడు భూములుగా మారిపోయే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అంతే కాక పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గిపోతాయని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచిస్తున్నారు. మరో వైపు తెగుళ్ల ఎక్కువై ఏటా నష్టాలను చవి చూస్తుండడంతో రైతుల ఆలోచనల్లో కూడా మార్పు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు పశువుల వ్యర్థాలను పంట పొలాల్లో కలపడం ద్వారా భూసారాన్ని పెంచుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల విసర్జితాలను కొనుగోలు చేసి పంట పొలాలకు తోలుతున్నారు. వేరే ప్రాంతాల నుంచి మేత కోసం వచ్చే గొర్రెల కాపరులకు ఎక్కువ డిమాండ్ ఉంది.

ఎరువుల లభ్యత ఇలా–

- పశువుల వ్యర్థాలను పొలాలకు తోలుకోవడంతో పాటు గొర్రెలను, మేకలను పొలంలో మంద కట్టించడం, కోళ్ల వ్యర్థాలు వంటి వాటిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి.
- పశువుల పేడను కంపోస్టు విధానం ద్వారా నిల్వ చేసుకున్న తర్వాత పంట పొలాలకు తరలించుకోవాలి.
- వేప పిండి, చెట్ల ఆకుల ఎరువులను కొనుగోలు చేసుకోవచ్చు. అంతే కాకుండా రైతులు సొంతంగా వర్మీ కంపోస్టు ఏర్పాటు చేసుకొని సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చు.

సేంద్రియ ఎరువుల వల్ల ఉపయోగాలు

- భూమిలో తేమ శాతం పెరగడంతో పాటు మొక్కలకు సరిపడా తేమను అందించేందుకు ఉపయోగపడుతుంది.
- పంటకు కావలసిన ముఖ్య పోషకాలు సేంద్రియ ఎరువుల వల్ల అందుతాయి.
- సేంద్రియ ఎరువును భూమిలో కలపడం ద్వారా మొక్క త్వరగా భూమిలోకి చొచ్చుకొని పోయి ఏపుగా పెరుగుతుంది.
- సేంద్రియ ఎరువును ఎండాకాలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నే ముందు భూమిలో చల్లి కలియదున్నితే వర్షాలకు ఎరువు కొట్టుకుపోకుండా వుంటుంది.



బావిలో పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు

కళావిహీనంగా పసరక్కర బావి

పెనుకొండ: పట్టణంలో విజయనగర రాజుల కాలంలో నిర్మించిన పసరక్కర బావి కళావిహీనంగా మారింది. బావిలోని కట్టడం రాళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. బావిలో ఎటుచూసినా పిచ్చి మొక్కలే దర్శనం ఇస్తున్నాయి. బావిలోకి దిగే పరిస్థితి సైతం లేదు. పురాతన కట్టడాల పరిరక్షణలో భాగంగా స్థానిక భోగసముద్రం జలవన పరిరక్షణ సమితి నాయకులు గతంలో చెరువును శుభ్రం చేసి బావిలోకి ఎవలోకి ఎవరూ దిగకుండా, వ్యర్థ పదార్థాలు వేయకుండా చుట్టూ ఇనుప కంచె వేయించారు. ప్రధాన మెట్లు దిగే ప్రాంతంలో పెద్ద ఇనుప గేట్లను వేసి తాళాలు వేశారు. అయితే బావిలో ప్రస్తుతం రాతి కట్టడాల మధ్య పెరుగుతున్న రావి, వేప చెట్లతో పాటు ఇతర పిచ్చి మొక్కల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలాగే వదిలిపెడితే రాళ్లన్నీ విరిగిపోయి పురాటన కట్టడం కాలగర్భంలో కలిసిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'రెడ్డి వివాహ పరిచయ వేదిక' విజయవంతం



వివాహ పరిచయ వేదికకు హాజరైన రెడ్డి కులస్తులు

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' విజయవంతమైంది. అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివాహ పరిచయ వేదికకు జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి దాదాపు 80 మంది దాకా హాజరయ్యారు. వధువు, వరుడి వివరాలు, ఫొటోలు పరిశీలించారు. ప్రతినెలా రెండో ఆదివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్ రెడ్డి, సెక్రటరీ దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, ఈసీ మెంబర్లు మంత్రి విశ్వనాథ్ రెడ్డి, కల్లూరు నాగరత్నారెడ్డి, చంద్రమౌళి రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బాబుల్ రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



చిన్నారికి ప్రశంసాపత్రం అందిస్తున్న అతిథులు

ధర్మవరం: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం మల్టీస్టార్ బుడోకాన్ అకాడమీ కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీలలో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎల్లో, ఆరంజ్, గ్రీన్, బ్లూ , పర్పుల్, బ్రౌన్ బెల్ట్‌లను హెచ్‌ఎం మేరీ వరకుమారి, సీనియర్ కరాటే మాస్టర్ శ్రీనివాసులు, అక్బర్ అలీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు యుద్ధ విద్యలలో ప్రావీణ్యం కనబరచడం ద్వారా ఆత్మ విశ్వాసం పెంపొందడంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి యుద్ధ విద్యలు నేర్చుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలన్నారు.

సాయి భక్తుల భిక్షాటన

పెనుకొండ: పట్టణంలో ఆదివారం సాయి భక్తులు భిక్షాటన చేపట్టారు. ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలు జరగనున్న నేపథ్యంలో సాయి భక్తులు ఇంటింటా తిరిగి భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ స్థానిక ఆల్విన్ కాలనీలోని సత్యసాయి, షిర్డీసాయి ఆలయంలో గురుపౌర్ణమి రోజున పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వెల్లడించారు.

కల్యాణ మండపం నిర్మించుకుందాం

అనంతపురం ఎడ్యుకేషన్: కల్యాణ మండపం నిర్మాణ కలను సాకారం చేసుకోవడానికి శక్తి వంచన అందరూ కలిసికట్టుగా కృషి చేద్దామని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గుత్తి రోడ్డులోని సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడు పెరవలి రాము అధ్యక్షతన జరిగిన సమావేశానికి కార్యనిర్వాహక అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, గౌరవ అధ్యక్షులు చింతకుంట రామయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరాముడు, మహిళా నాయకురాలు విశాలాక్షి, విజయ భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు గార్లదిన్నె నాగరాజు, మేడాపురం లక్ష్మయ్య హాజరయ్యారు. పేద విద్యార్థుల చదువుకు సహాయ సహకారాలు అందిద్దామని నాయకులు కోరారు.

21న గోదావరి కవితోత్సవం

అనంతపురం కల్చరల్: ఈనెల 21 పిఠాపురం వేదికగా సాగే గోదావరి కవితోత్సవం పోస్టర్లను ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరానికి విచ్చేసిన సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు గుత్తాహరిసర్వోత్తమ నాయుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రమేష్ నారాయణ, శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వడ్డే సుధాకర్ మాట్లాడారు.

పెద్దమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న పెద్దమ్మ దేవత

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి ఆభరణాలు, పలు రకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్దసంఖ్యలలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

17న ద్విచక్రవాహనాల వేలం

చెన్నేకొత్తపల్లి: స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను ఈనెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ లలితా దేవి, ఎస్‌ఐ శివప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెబ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు డిపాజిట్ చెల్లించి పాల్గొలన్నారు. వాహనాలు కొనదలచిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు

నల్లచెరువు: చిన్నపల్లోల్లపల్లి వద్ద ద్విచక్రవాహనంపై నుంచి ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. తనకల్లు మండలం దండువారిపల్లికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి తన భార్య సంధ్య పిల్లలతో కలిసి ఆదివారం భార్య పుట్టినిల్లు అయిన మలక వేమలకు ద్విచక్రవాహనంపై బయలు దేరారు. చిన్నపల్లోల్లపల్లి వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు మీద పడడంతో సంధ్య తలకు తీవ్ర గాయమైంది. విష్ణువర్ధన్‌రెడ్డి, పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను 108 ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన బాషా

బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆదివారం కారును బైకు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం..ధర్మవరం నుంచి అనంతపురం కారు బయలుదేరింది. ఇదే సమయంలో బైకులో అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు రాంగు రూటులో వస్తున్న బాషా(అనంతపురం వ్యక్తి) ఎదురుగా వస్తున్న కారును లింగారెడ్డిపల్లి క్రాస్ వద్ద ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఆర్డీటి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రున్ని పరామర్శించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఎంఎండీఏ నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఇమామ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మారుతీనగర్‌లో ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషన్(ఎంఎండీఏ) జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు ఇమామ్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. యంయండీఏ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ రోషన్ జమీర్, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా సయ్యద్ దాదాపీర్, ధర్మవరం పట్టణాధ్యక్షుడిగా ఫరూక్, పుట్టపర్తి అధ్యక్షుడిగా మస్తాన్‌వలిలను నియమించారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో గౌసియా మసీదు కమిటీ సభ్యులు నబిరసూల్, హసీనా, జిక్రియా, మహబూబ్‌బాష, ఖాదర్‌వలి, జమీర్, షాజిద్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 5 మంది విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటాచలం ఆదివారం తెలిపారు. తమ పాఠశాలలో పదవతరగతి చదివిన రీమాతబుసుమ్, విద్యాప్రియ, ఆసిఫా, హస్పిబా, పఠాన్ ఆష్పా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ధర్మవరం డివిజన్
9912220717, 9912220727,
9912220726, 9010593486